సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,12 మార్చి 2025


# మెరుగైన వసతులు కల్పించాలి

**– జిల్లా డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు**




**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి కళ్యాణోత్సవాలు సమీపిస్తున్నందున భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ కాకినాడ జిల్లా డిప్యూటీ కమిషనర్ డి.ఎల్.వి. రమేష్‌బాబు, కోనసీమ జిల్లాఅధికారి సత్య నారాయణలు అన్నారు. వారు మంగళవారం ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. శ్రీవారికల్యాణం నిర్వహించే శ్రీనివాస

- తరువాయి 2లో..

# పి-4 సర్వేలో పాల్గొనండి..

**- తగిన సమాచారం అందించి సహకరించాలి**
**- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విజ్ఞప్తి**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో పి4 సర్వే పబ్లిక్, ప్రవేటు, పీపుల్స్ పార్టీసీపేషన్ సర్వే నిర్వహిస్తున్నట్లు, ఇప్పటి వరకు పబ్లిక్ ప్రవేటు భాగ స్వామ్యంతో కలిసి పనిచెయ్యడం జరుగు తోందని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఒకవిడియో సందేశంలో పేర్కొన్నారు. ఇందులో ప్రజలని కూడా భాగస్వామ్యం చేసుకోవాలని,ఈ క్రమం లోనే జిల్లాలోని పేదల్లో పేదలని గుర్తించడం, వారి తలసరి ఆదాయం పెంచే ప్రయత్నంలో వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని,వారు ఏపనిచేస్తే ఆదాయం వస్తుందని అనేఅంశాలని ప్రత్యక్షంగా తెలుసు కోవడం కోసం ఈ సర్వే చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ఇందు నిమిత్తం ఆగ్రామంలో ఎవరైతే ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నారో గుర్తించి, వారి యొక్క సహకారం తీసుకోవడం అనేది ఈ కార్యక్రమం యొక్కముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఇందు కోసం సచివాలయం సిబ్బంది అందరినీ సర్వేలో పాల్గొనడం, వివరాలు తెలుసుకోవడం జరుగుతోందని, ప్రజలందరు ఈ సర్వేలో పాల్గొని తగిన సమాచారం అందించాలని కోరారు.మీతోటి వారి అభివృద్ధి కోసం ఆసక్తి కలిగి ఉన్నారో వారు సర్వే చేసే సిబ్బందికి తగిన సహకారం అందించి,మీ అంగీకారం తెలియ చెయడం జరగాలన్నారు. ఈకార్యక్రమంలో పేదల్లో పేదలని గుర్తించి వారికి మరింత మెరుగైన జీవన భృతి కల్పించడం, అదే విధంగా వారి కుటుంబాల ఆరోగ్య, విద్యాప్రమాణాలు పెంచడం ధ్యేయం,ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ సర్వే చేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకి పిజిఆర్ఎస్ ద్వారావారి సమస్యలు పరిష్కారం కోసం ఇస్తున్న అర్జిల య్నొక్క పరిష్కార స్థాయి, ప్రజల సంతృప్తి స్థాయి తెలుసుకోవడంకూడా సమాం తరంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి ప్రశాంతి తెలియచేసారు.ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో, డివిజన్ మండల స్థాయిలో, ఆన్లైన్ పోర్టల్, సిఎం గ్రివియన్స్ ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఆయా అర్జీలను పరిష్కరించడం జరుగుతోందని, అయితే ప్రజలనుంచి ప్రత్యక్షంగావారి సంతృప్తి స్థాయి తెలుసుకునే ప్రయత్నం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు అర్జీలను పరిష్కారం చేశారా లేదా వారితో ఏ విధంగా ప్రవర్తించారు తదితర అంశాల గురించి సర్వే సందర్భంలో వివరాలు తెలుసుకోవడం జరుగుతుందని, వాటికీ కూడా తగిన రీతిలో స్పందించి మీ విలువైన అభిప్రాయాలను వ్యక్తం చెయ్యాలని కలక్టర్ ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. కావున జిల్లా ప్రజలందరు సర్వే సిబ్బందికి పి4సర్వే వివరాలు, పిజిఆర్ఎస్ సర్వే వివరాలు తెలియ చేయండి మరింత మెరుగైన పరిపాలన అందించే

- తరువాయి 2లో..

## ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి

# రాజకీయ పార్టీలు సహకరించాలి

**– జిల్లా కలెక్టర్ షణ్మోహన్**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయాడానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అవసరమైన సలహాలు, సూచనలు మార్చి31 నాటికి అందజేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రక్రియలోనూతన సంస్కరణలు తీసుకొచ్చే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం అన్నిజాతీయ,రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి అవసరమైన సూచనలు సలహాలను ఆహ్వానిం చిందన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, 1951, ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి వంటి ఇతర అంశాలపై ఎన్నికల సంఘం సూచనలను ఆహ్వానించిందని ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియను బలోపేతంచేయడమే కాకుండా పారదర్శకంగా,స్వేచ్ఛాయుత వాతా వరణంలో ఎన్నికల్లో నిర్వహించేందుకు మార్చి31 లోపు అందించిన సూచనలు, సలహాలను ఈసీఐకి నివేదించడం జరుగుతుందన్నారు. ఈ సూచనలు, సలహాలపై భారతీయ ఎన్నికల

- తరువాయి 2లో..

## ఎమ్మెస్ఎంఈ సంస్థలకు

# ఇన్సెంటివ్‌లు సకాలంలో ఇవ్వాలి

**-ఎంపీటీసీలకు, జడ్పీటీసీలకు, గ్రామ సర్పంచులకు, గౌరవ వేతనం పెంచాలి**
**-కౌన్సిల్లో ప్రవేశపెట్టే బిల్లుల ప్రతులను సభ్యులకు ముందుగా ఇవ్వాలి -ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్**




**పెరవలి,మేజర్‌న్యూస్ :** ఎమ్మెస్ఎంఈ సంస్థలకు ఇన్సెంటివ్స్ సకాలంలో ఇవ్వాలని, దీనికి తోడు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన గ్రామీణ ఎమ్మెస్ఎంఈ సంస్థకు చేరేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. మార్చి 11వ తేదీ మంగళవారం ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఇన్సెంటివ్స్ ఇచ్చే విషయంలో పూర్తి ట్రాన్సరెన్సీ ఉండాలని ,ముందుగా శాంక్షన్ ఆయనవి, ముందుగా ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వం లో జగనన్న బడుగు వికాసం పథకంలో అనేక ఎస్సీ ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన ఎమ్మెస్ఎంఈలుబస్‌లు కొనుగోలు చేసుకొని,ఆర్టీసీద్వారారూట్‌లలో తిప్పుకుంటున్నారు. వీరికి ప్రభుత్వం ఇచ్చేరాయితీ 50% వెంటనే చెల్లించాలి అని ,ఇది ఆలస్యం ఐయితే పేద వర్గాలకు చెందిన ఎమ్మెస్ఎంఈలు ఆర్థికంగా నష్ట పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కౌన్సిల్ లో ప్రవేశపెట్టే బిల్స్‌అప్పటికప్పుడు ఇవ్వడం మూలంగా, బిల్స్‌పై

- తరువాయి 2లో..

## గిరిజనేతరులకు

# పక్కా గృహాలు మంజూరు చేయాలి

**- శాసనసభలో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి**



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** గిరిజన చట్టాలకు విఘాతం కలగకుండా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులకు పక్కా గృహాలను మంజూరు చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి రంపచోడవరం నియోజకవర్గం సమస్యలపై శాసనసభలో మాట్లాడు తూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో దాదాపుగా గిరిజనేతరులు 40శాతం మంది ఉన్నారన్నారు. అయితే 1952నాటికి పూర్వం నియోజక వర్గాలు ఏర్పాటు చేసే సమయానికే గిరిజనేతరులు తమ నియోజకవర్గంలో ఉన్నందున వారికి పక్కా నివాస గృహాలు ఏర్పాటుకు వెసులు బాటు కల్పించాలని శాసనసభా అధ్యక్షులకు కోరారు. అదేవిధంగా తమ ప్రాంతంలో ఎస్సీ కులస్తులు నిరుపేదలుగానే ఉన్నారని, కొన్ని వందల ఏళ్లుగా గిరిజనులు గిరిజనేతరులు మేమందరం అన్నదమ్ముల వలే కలిసి ఉన్నాం కాబట్టి గిరిజన చట్టాలకు ఎటువంటి విఘాతం కలగకుండా గిరిజనేతరులకు న్యాయం చేయాలని అన్నారు.

- తరువాయి 2లో..

# వరుస ఫిర్యాదులు.. నెక్స్ట్ దువ్వాడేనా

**పశ్చిమగోదావరి, మేజర్ న్యూస్ :** ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన నాయకులు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షులు అనుచిత వ్యాఖ్యలు చేసిన దువ్వాడ శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల అసెంబ్లీ సమావేశం ప్రారంభ సమయంలో దువ్వాడ.. డిప్యూటీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పవన్ కుటుంబానికి సంబంధించి కామెంట్స్ చేశారు. పవన్‌పై అసభ్యపదజాలంతో విరుచుకుపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దువ్వాడ శ్రీనివాస్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి.దువ్వాడ వ్యాఖ్యలపై జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భీమవరం రూరల్ పోలీస్‌స్టేసన్‌లో దువ్వాడపై జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీలను పోలీసులకు స్వీకరించారు. అయితే పోలీసులు ఇంకా కేసు నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు కాపీ పంపించిన అనంతరం వారు సూచనల మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. పవన్‌పై దువ్వాడ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి.

అయితే వైసీపీ నేతలపై వరుస కేసులు నమోదు అవుతున్నప్పటికీ ఆ పార్టీ నేతల తీరు మాత్రం మారడం లేదు. ఇప్పటికే వల్లభనేని వంశీ, పోసాని కృష్ణ మురళిపై కేసులు నమోదు అవడమే కాకుండా వారిని అరెస్ట్ చేసి రిమాండ్ ఖైదీలుగా ఉంచారు. ఇంత జరుగుతున్నప్పటికీ ఆ పార్టీ నేతల మాటల ప్రవాహం ఏ మాత్రం తగ్గడం లేదు. డిప్యూటీ సీఎం పవన్‌పై దువ్వాడ చేసిన కామెంట్స్ తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. అసెంబ్లీకి వచ్చే ముందు పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్సీ. చంద్రబాబును ప్రశ్నించకుండా ఉండేందుకు పవన్ నెలకు రూ.50 కోట్లు తీసుకుంటున్నారని, అందుకే ఆయన శాసనసభలో కనిపించడం లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

ఈ వ్యాఖ్యలను జనసేన నేతలు తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా దువ్వాడపై రాష్ట్ర వ్యాప్తంగా కూడా కేసులు నమోదు అయ్యాయి. పవన్ కళ్యాణ్‌పై దువ్వాడ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ముందుగా గుంటూరులోని పాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. అలాగే విజయనగరంలో కొప్పుల వెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు



**పిఠాపురం, మేజర్‌న్యూస్ :** పిఠాపురం వ్యవసాయ శాఖ అధికారి స్వాతి ఆధ్వర్యంలో వెల్దుర్తి మరియు పి.దొంతమూరు గ్రామములలో మండల వ్యవసాయ అధికారి పిఠాపురం ఏ.అచ్యుతరావు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్, పీఎం కిసాన్ పథకం అమలు, వేసవి అపరాల సాగు, పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ మరియు పిల్లిపెసర విత్తనములు... సబ్సిడీపై సరఫరా చేయడం జరుగుతుందని, వ్యయసాయ యాంత్రీకరణ క్రింద పవర్ టిల్లర్లు, బ్యాటరీ స్ప్రేయర్స్ , తైవాన్ స్ప్రేయర్స్, ట్రాక్టర్ పనిముట్లు, రోటావేటర్లు సబ్సిడీపై సరఫరా వివరములు గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు శ్రీ రాజ్యాంగ మాణిక్యం, కీర్తి చక్రదొర, బండి సత్యనారాయణ, పోకనాటి వీరబాబు, రాసంశెట్టి చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి అవసరాలకు వాసవి క్లబ్ అధ్యక్షులు మన్యం గుప్తా సహకారంతో 1/2 హెచ్‌పి మోటర్ బహుమతి

**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** వాసవి క్లబ్ జోనల్ చైర్మన్ అధికార పర్యటన భాగంగా కొవ్వూరు ప్రెస్ క్లబ్ నందు తాగునీటి అవసరాలకు ప్రెస్ క్లబ్ కు వాసవి క్లబ్ అధ్యక్షులు మన్యం గుప్తా సహకారంతో 1/2 హెచ్‌పి మోటర్ బహుమతిగా ఇవ్వడం జరిగింది.

అందులో భాగంగా మంగళవారం శిలాఫలకాన్ని ప్రెస్ క్లబ్ నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు మన్యం గుప్తా మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ చైర్మన్ కాకి అనిల్ సూర్య వలివేటి ప్రసాద్, దేవతు కృష్ణ ప్రసాద్, వాసవి క్లబ్ సెక్రటరీ సత్యవరపు గురునాథ్, ట్రెజరర్, సత్య వరపు భరత్, తీగల రవికుమార్, రాఘువ రమాకాంత్, వల్లాల నాగబాబు, చెక్క సూర్య గౌతమ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసే క్రమంలో అధికారులతో కూడిన ఎక్సపెర్ట్ కమిటీ



**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** నిడదవోలు రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసే క్రమంలో అధికారులతో కూడిన ఎక్సపెర్ట్ కమిటి క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, నివేదిక అందచేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియ చేశారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రెవిన్యూ, రైల్వే అధికారులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, నిడదవోలు రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో సింగవరం, శెట్టిపేట , తాళ్ళపాలెం గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరిగిందన్నారు. అయితే సమన్వయ శాఖల, సాంకేతిక నిపుణులతో కూడిన అధికారుల బృందం వాస్తవ పరిస్థితిని అంచనా వేసి నివేదిక అందచెయ్యాలని తెలిపారు. ఆర్డీవో , రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు , ఎస్ ఈ ఇరిగేషన్ , జిల్లా వ్యవసాయ అధికారి లతో కలిసి రానున్న రెండు మూడు రోజుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నివేదిక అందచేయాలని పేర్కొన్నారు. ఎర్ర కాలువ వరదలు వచ్చినప్పుడు ముంపు ప్రమాదం నేపథ్యం లో పరిష్కారం కోసం అధికారులు ఇచ్చే సూచనలను అనుసరించి జిల్లా మంత్రి వర్యులుతో చర్చించి , అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కొవ్వూరు ఆర్డిఓ రాణి సుస్మిత, రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్ , నిడదవోలు తాహసిల్దార్ బి. నాగరాజు నాయక్, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్‌లు హాజరయ్యారు.

## మెరుగైన వసతులు కల్పించాలి

మొదటిపేజి తరువాయి

ప్రాంగణాన్ని పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్యాణోత్సవాలు ముందుగా జరిగే అధ్యయనోత్సవాలకు కూడా ఇప్పటినుండే తగు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయా ఉత్సవాలకు లక్ష పైబడి భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూసు కోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు, సిబ్బంది ఉన్నారు.

## పి-4 సర్వేలో పాల్గొనండి..

మొదటిపేజి తరువాయి

ప్రయత్నంలో భాగస్వామ్యంకావాలని ఆకాంక్షించారు. జిల్లాలో 133548 గృహాలని 502 గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న 3408 సచివాలయ సిబ్బంది ఈ సర్వేలో పాల్గొనడం జరుగుతున్నట్లు తెలిపారు.మార్చి18వరకూ సర్వే ప్రక్రియ చేపట్టనున్నట్లు, సర్వే సిబ్బంది కి తగిన సహకారం అందించి జిల్లా ప్రగతి పథంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

## ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

మొదటిపేజి తరువాయి

సంఘం ఏప్రిల్ 30న అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల సభ్యులతో చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలను మరింతబలోపేతం చేయా డానికి కాకినాడ జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అవసరమైన సలహాలు, సూచనలు ఈనెల 31 నాటికి అంద జేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు.

## ఎమ్మెస్ఎంఈ సంస్థలకు ఇన్సెంటివ్‌లు సకాలంలో ఇవ్వాలి

మొదటిపేజి తరువాయి

సూచనలు, సలహాలు ఇవ్వడానికి అవకాశం లేదు. ఇకనుండి బిల్స్ పేపర్స్ ను ముందుగా కౌన్సిల్ సభ్యులకు సర్కులేట్ చేయాలని రవీంద్ర నాథ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

స్థానికి సంస్థల ప్రతినిధులైన ఎంపీటీసీ, జీపీటీసీ సభ్యులకు, గ్రామ సర్పంచులకు గౌరవ వేతనాన్ని పెంచాలని గత ప్రభుత్వంలో వేతనాలు పెంచుతాను అని ఇచ్చిన హామీ మేరకు వారి వేతనాలను పెంచి ఇచ్చిన హామీని అమలు చేయాలని రవీంద్రనాథ్ కోరారు.

## గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయాలి

మొదటిపేజి తరువాయి

**గృహ నిర్మాణ లబ్ధిదారులకు శుభవార్త : ఎమ్మెల్యే శిరీష దేవి**

రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఇళ్లు కట్టుకునే ఎస్సీ ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు సాయం చేయడంపై ప్రభుత్వం జీవో జారీ చేసిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి తెలిపారు. ఎస్టీలకు రూ.75వేలు, పివిటిజిలకు రూ.1 లక్ష సాయం అందించనుందని తెలిపారు.పిఎంఎవై (అర్బన్, గ్రామీణ్) బీఎల్సీ-1.0కింద ఇప్పటికే మంజూరైన ఇళ్లకు ఈసాయం లభించనుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ జైన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజాబాబుకు ఎమ్మెల్యే శిరీష దేవి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్‌జిఓలు సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిశ కె.రత్న ప్రసాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనము నందు స్థానిక ఎన్జీవో సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసారు ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లా డుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలపై ప్రజలను చైతన్యపరచాలని, అలాగే ప్రజలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు వారధిగా పని చేయాలని సూచించారు.

# ఉచిత ఇసుక విధానంపై మంత్రి కొల్లు రవీంద్రను ప్రశ్నించిన బొమ్మి ఇజ్రాయిల్



**అల్లవరం, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో బొమ్మి ఇజ్రాయిల్ ఉచిత ఇసుక విధానం మరియు ఇసుక అక్రమ తవ్వకాలపై ఆంధ్రప్రదేశ్ గనులు భూగర్భ జలాల శాఖ మంత్రి కొల్లు రవీంద్రని మంగళవారం ప్రశ్నించడం జరిగింది. సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత ఇసుక విధానం అమలులోకి వచ్చినప్పటికీ రాష్ట్రంలో వినియోగదారుడికి ఇసుక అందని ద్రాక్షగాని మిగిలిపోయిందని, గోదావరి, కృష్ణ, పెన్న వంటి నదీ పరివాహ ప్రాంతాల్లో సరైన అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టారని, దీనివల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం ఏర్పడుతుందని, తద్వారా తీవ్రమైన వరదలు సంభవిస్తాయని తెలియజేశారు. ప్రస్తుత ప్రభుత్వం సీనరేజ్ రూపంలో టన్నుకు 246 రూపాయలు వసూలు చేస్తూ ప్రతి మనిషికి గరిష్టంగా 20 టన్నులు ఉచిత ఇసుక రవాణా సౌకర్యం కల్పించింది. కానీ స్టాక్ పాయింట్లు జిల్లాలో తక్కువ స్థాయిలు ఇవ్వటం వల్ల ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు పెరిగిపోయి వినియోగదారుడి వద్ద ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. రాష్ట్రంలో 10 శాతం మాత్రమే ఆన్లైన్లో బుక్ చేస్తుంటే మిగతా 90% లారీలు అక్రమార్కుల చేతిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. దీనికి సాయం జిల్లాలోని అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై అక్రమ ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని తెలియజేశారు. ఈ విధంగా అధికారులు, రాజకీయ నాయకులు ఇసుక దందాల ద్వారా వందల కోట్ల వ్యాపారం చేస్తున్నారు. మన రాష్ట్రంలో ఇసుక వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతూ ఉన్నప్పటికీ తూతూ మంత్రంగా అక్కడక్కడ నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు. రవాణా చార్జీలు, నిర్వహణ చార్జీలు (ఆపరేషనల్ కాస్ట్), జీఎస్టీ వసూలు చేస్తుండటం, అవి ఒక్కోచోట ఒక్కోరకంగా ఉండటం సమస్యను తీవ్రతరం చేశాయి.

చాలాచోట్ల నిర్వహణ చార్జీలు.. రవాణా చార్జీలతో సమానంగా ఉంటున్నాయి. కొన్ని స్టాక్ పాయింట్లలో నిర్వహణ చార్జీలే ఎక్కువగా వసూలు చేస్తున్నారు. ఉచితంగా ఇవ్వడమే ప్రధాన లక్ష్యం అనుకుంటే నిర్వహణా చార్జీల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఉంది. అలాగే ఇసుక ఉచితమైనప్పుడు జీఎస్టీ ఎందుకన్నది మరో కీలక ప్రశ్న. ఇప్పటికైనా ఇసుక విధానంపై వస్తున్న ఆరోపణలు పరిగణలో తీసుకొని, పేద ప్రజలు వినియోగదారులకు నిజమైన ప్రయోజనం కలగాలంటే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి అక్రమ ఇసుకకు అడ్డుకట్ట వేసి వినియోగదారునికి ఇసుకను ఉచితంగా అందజేయాలని కోరారు.

# అంధత్వ నివారణలో సైతం రెడ్ క్రాస్ ముందడుగు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** విభిన్న సేవా కార్యక్రమాలతో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్న రెడ్ క్రాస్ కాకినాడ జిల్లా శాఖ అంధత్వ నివారణలో సైతం ముందడుగు వేసింది. గత సంవత్సరం రెడ్ క్రాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు మరియు గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించబడిన "లకంసాని విరీన్ మానస్ రెడ్ క్రాస్ ఐ బ్యాంకు' మార్చి 11న కార్యకలాపాలు ప్రారంభించి నేటికి ఒక సంవత్సరం పూర్తి అయిందని ఈ కాలంలో 158 కార్నియాలను సేకరించి ఎల్.వి. ప్రసాద్ మరియు కిరణ్ కంటి ఆసుపత్రుల ద్వారా అంధుల జీవితాలలో వెలుగు నింపిందని సంస్థ చైర్మన్ వై.డి.రామారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. నేత్రదానం చేసి అమరులు అయినవారికి దానికి సహకరించిన వారి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా రామారావు కృతజ్ఞతలు తెలియజేశారు. నేత్రదాన ప్రతిజ్ఞ చేయడం ద్వారా అంధులకు కొత్త జీవితాన్ని ప్రసాదించడానికి ముందుకు రావలసిందిగా ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత సంవత్సర కాలంలో రెడ్ క్రాస్ ఐ బ్యాంకును సందర్శించి మద్దతు తెలియజేసిన కలెక్టర్ షన్మోహన్ సగిలి, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు, డాక్టర్ జయప్రకాష్ నారాయణ, గజల్ శ్రీనివాస్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, నన్నయ్య విశ్వ విద్యాలయ ఉపకులపతి డా. కె.పద్మ రాజు వంటి వివిధ ప్రముఖులకు రామారావు ధన్యవాదాలు తెలియజేశారు.

## మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** సోమవారం సాయంత్రం మండల



పరిధిలోని ఊబాలంక గ్రామంలో రావులపాలెం బొబ్బలంక రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రేయపురం మండలం కట్టంగ గ్రామానికి చెందిన వంద్రె రాజకుమారి అక్కడికక్కడే మృతి చెందింది. వీరు వ్యక్తిగత పని నిమిత్తం నిన్న అమలాపురం వెళ్లి రావులపాలెం మీదుగా స్వగ్రామం కట్టుంగ వెళుతుండగా ఊబాలంక వద్ద ఆర్ అండ్ బి రోడ్డుపై వెనక నుండి టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ఈమె అక్కడికక్కడే మృతి చెందింది. అయితే లారీ యజమానులు వీరి కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం మధ్యాహ్నం సమయంలో రావులపాలెంలోని 216ఏ జాతీయ రహదారిపై గ్రామస్తులు కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా నిర్వహించారు. పోలీస్‌లు వీరితో చర్చలు జరిపి కుటుంబానికి న్యాయం జరిగేటట్టు చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

# ఏజెన్సీలో ఘనంగా ఆదివాసీల తోట పండుగ





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఘనంగా ఆదివాసీలు తోట పండుగ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏజెన్సీ ప్రాంతంలోని మారేడుమిల్లి మండలం దెందులూరు సమీపంలోని కోతుల కట్టవ గ్రామంలో మంగళవారం వనదేవతలకు తోట పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పండుగ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆదివాసీ జాగృతి అధ్యక్షులు కారం సీతారామన్న దొర ( ఢిల్లీ బాబు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతారామన్న దొర మాట్లాడుతూ మన్య ప్రాంతాల్లో గిరిజన ఆచారాలు, సాంప్రదాయాలు మరవకుండా ఘనంగా నిర్వహించుకోవాలని, తరతరాలుగా వారసత్వానికి ఈ పండుగలే నిదర్శనమని, ఈ సందర్భంగా కారం సీతారామన్న దొర గుర్తు చేశారు.

తమకు వచ్చే మొదటి పంటలను వన దేవతలకు సమర్పించి, ప్రకృతితో మమేకమైన ఆదివాసీలు అడవి తల్లికి పూజలు చేశారు. తమ వారసత్వాన్ని పరిరక్షించుకునేలా తోట పండుగలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోట పండుగ నిర్వాహకులు నూనె అన్నవరం, నూనె వెంకటరెడ్డి, కత్తుల కుమార్ రెడ్డి, కత్తుల సుభాష్ చంద్రబోస్, బచ్చల గణేష్ రెడ్డి, ఒంటుకుల సన్యాసి రెడ్డి, కారం చిన్నబ్బాయి దొర, కొండపల్లి శివ, మాజీ సర్పంచ్ కత్తుల సుగ్గిరెడ్డి, వార్డ్ మెంబర్లు కాకూరు సత్తిరెడ్డి, భూమిరెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరీక్షలంటే విద్యార్థులు భయాందోళన విడనాడాలి



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** పదోతరగతి పరీక్షలు అంటే విద్యార్థులు ముందుగా భయాందోళనలు విడనాడాలని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి అన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలోని ఏహెచ్‌ఎస్, ముసురుమిల్లి, ఏహెచ్‌ఎస్ (బాలికలు) రంపచోడవరం, ఏపిఆర్ఎస్ఎస్ (బాలికలు) సీతపల్లి, ఏహెచ్ఎస్ (బాలికలు) కాకవాడ, ఏహెచ్ఎస్ (బాలికలు) బూసిగూడెం, జడ్‌పిహెచ్ఎస్ పెదాగెద్దాడ, కెజిబివిఎస్ ఇర్లపల్లి, ఏపిఆర్ఎస్ (బాలురు) రంపచోడవరం, ఏహెచ్ఎస్ (బాలురు) రంపచోడవరం పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి ఆల్ ది బెస్ట్ విషెస్ చెప్పారు. విద్యార్థులు పరీక్షలంటే భయాందోళనలకు గురికావద్దని, మానసిక ప్రశాంతతతో ఉండి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకొని మీకు, మీ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలలకు తద్వారా మన రంపచోడవరం మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆశిస్తున్నానని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి అన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆమె సొంత నిధులతో స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుందం శ్రీనివాసుదొర మాట్లాడుతూ 500 పైబడి మార్కులు తెచ్చుకునే ప్రతీ ఒక్కరికీ 1,116 రూపాయలు పారితోషికంగా అందజేయడం జరుగుతుందన్నారు. మండల విద్యాశాఖాధికారి రామకృష్ణ మాట్లాడుతూ ఎంపీపీ ఉదార స్వభావంతో విద్యార్థులకు ఇచ్చే వస్తువు చిన్నపాటిదే అయినా దాని విలువ అమోఘమని, అది గుర్తెరిగి పరీక్షలు బాగా వ్రాసి మంచి మార్కులు తెచ్చుకొని మనందరికి మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ఎంపీపీ బంధం శ్రీదేవి చేతులు మీదుగా విద్యార్థులకు హాల్ టికెట్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడీపీఓ సంధ్యారాణి, ఎంపీటీసీ వంశీ కుంజం, బొబ్బా శేఖర్ పాల్గొన్నారు.

## యువత పోరును జయప్రదం చేయాలంటూ వైఎస్ఆర్సీపీ ఇన్చార్జి తలారి వెంకటరావు పిలుపు



**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్ఆర్సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జి తలారి వెంకటరావు పిలుపు నిచ్చారు. మంగళవారం పట్టణంలోని వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అబద్ధపు హామీలతో చంద్రబాబు అధికారం చేపట్టారన్నారు. కూటమి పాలనలో సంక్షేమం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు ఇవ్వాల్సిన ఫీజ్ రీఎంబెర్స్మెంట్, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. ఈ నెల 12 న చేపట్టే యువత పోరుకు విద్యార్థులు, నిరుద్యోగ యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. వైఎస్ఆర్సీపీ జిల్లా యువత అధ్యక్షులు కంఠమణి రమేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువత తరలి రావాలన్నారు.

కొవ్వూరు పార్టీ కార్యాలయం నుంచి రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని, కలెక్టర్ కు వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, నాయకులు సుంకర సత్యన్నారాయణ, రుత్తల భాస్కర్ రావు, చొప్పా అప్పలనాయుడు, మెరిపో వీర్రాజు, గొరిజాల పేర్రాజు, పలపాల సూర్యచంద్ర రావు, చిట్టూరి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ గ్లోకోమా వారోత్సవాలు




**- 9వ తారీకు నుండి 15వ తేదివరకు**

**- డీఎమ్‌హెచ్‌వో డా కే.వెంకటేశ్వర రావు**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** మంగళవారం జిల్లా వై ద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నందు డా.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. గ్లకోమా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ క్రింద విషయాలు తెలియజేసారు. గ్లకోమా వ్యాధి లక్షణాలు నివారణ చర్యలు

"సర్వేంద్రియనం నయనం ప్రధానం" అంటారు. మానవ శరీరంలోని అన్ని అవయవాలు సమన్వయానికి చాలా ప్రధానం కన్ను.

కంటి వ్యాధులు పట్ల అవగాహన లేక చాలామంది కంటి వ్యాధుల బారిన పడుతున్నారు. కంటి శుక్లాలు, దయాబెటిక్ రెటినోపతి, హైపర్టెన్స్ రెటినోపతి, గ్లాకోమా వంటివి అందత్వాని కారణాలు.గ్లాకోమా వ్యాధిని నీటి కాసులు అని కూడా పిలుస్తారు. మానవ శరీరంలో రక్తపీడనం సాధారణంగా120/80 మిలీ హెచ్‌జి ఉంటుంది.అలాగే కంటి లోపల ఉండే కంటిపీడనం 10-20 మిమి హెచ్‌జి ఉంటుంది. 20 మిమి హెచ్‌జి కంటే ఎక్కువ ఉన్న కంటి పీడనాన్ని సందేహాస్పదంగా పరిగణిస్తారు. 25మిమి హెచ్‌జి ఉన్న కంటిపీడనాన్ని గ్లాకోమ గా నేత్ర వైద్యులు ధ్రువీకరిస్తారు.కంటి పీడనాన్ని గుర్తించటానికి టోనోమీటర్ ద్వారా 5 రకాలుగా పరీక్షిస్తారు. ఈ పరికరాలు అన్నీ సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నాయి. గ్లాకోమ వ్యాధిని సాధారణంగా సైలెంట్ కిల్లర్ ఆఫ్ విజన్‌గా పిలుస్తారు. బాధాకరమైన విషయమేమంటే రోగి తనకి తెలియకుండా చూపును దశలవారీగా కోల్పోవడం జరుగుతుంది. గ్లాకోమావల్ల ఒక్కసారి కోల్పోయిన చూపును తిరిగి పొందలేము. కంటి లోపల ఆక్టియస్ హ్యూమర్ అనే నీటిలాంటి పదార్థము సరైన సమతుల పరిమాణంలో ఉత్పత్తి అవ్వనపుడు కంటికోణం సన్నబడుతుంది. దానివల్ల కంటిపీడనం పెరిగి ఆప్టిక్ నేర్వ్ దెబ్బతినడవలన పాక్షికంగా లేదా సంపూర్ణంగా చూపుకోల్పోయే ప్రమాదం వుంది. గ్లాకోమ వ్యాధిలో స్ట్రెయిట్ విజన్ బాగానే ఉన్నప్పటికీ సైడ్ విజన్ అంటే పెరిఫరల్ విజన్ మసకబారడం జరుగుతుంది. ఇది గ్లాకోమ వ్యాధి యొక్క విశిష్ట లక్షణాలలో ఒకటి. ప్రాధమిక దశలో గ్లాకోమ వ్యాధిలో ఎటువంటి వ్యాధిలక్షణాలు బహిర్గతం కావు. 50% కంటే ఎక్కువగా కంటినరం దెబ్బతిన్న తరువాత మాత్రమే వ్యాధి లక్షణాలు బహిర్గతమౌతాయి. గ్లాకోమ వ్యాధి లక్షణాలు చూపు మసకబారడం విపరీతమైన కంటినొప్పి, కంటి ఎరుపుదనం , తలనొప్పి , వికారం వాంతులు , తరచుగా దగ్గర చూపు కంటి అద్దాలు పవర్ మారడం , ప్రకాశవంతమైన లైటు చుట్టూ ఇంద్ర ధనుస్సు లాంటి రంగుల వలయాలు కనిపించడం ఆకస్మికంగా కంటిచూపు కోల్పోవటం ఎవరు ఎక్కువగా గ్లాకోమ వ్యాధి బారిన పడే అవకాశముంది.

1. గ్లాకోమ వ్యాధి వంశ పరంపర్యంగా ఫ్యామిలీ హిస్టరీ వున్నవారికి.
2. అధిక రక్తపోటు 3. అధిక డయాబెటీస్
4. అధిక కోలేస్ట్రాల్ 5. సిగరెట్, ధూమపానం చేసేవారికి
6. కేఫిన్ పదార్దాలు ఎక్కువగా సేవించే వారికి
7. మానసిక వ్యాధులకు మందులు వాడుతున్నవారికి
8. కిడ్నీ సంబంధిత వ్యాధులు గలవారికి
9. స్త్రీ, పురుష లింగ బేధం లేకుండా అందరికి గ్లాకోమ వ్యాధి సమానంగా వచ్చే అవకాశం వుంది.

10. 40 సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరిలో ఆప్టిక్ నాడికి రక్త ప్రసారణ తగ్గటం వలన గ్లాకోమ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది.

కావున ప్రజలందరూ అవగాహనతో కంటి ఆరోగ్యం ను కాపాడుకోవాలని తెలియజేసారు. ప్రతి సంవత్సరం జిల్లా అందత్వ నివారణ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ సంవత్సరం "గ్లకోమా రహిత సమాజం కోసం ఎక్కమావదాము "అనే నినాదంతో నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా లావణ్య, ఎపిడిమలాజిస్ట్ సుధీర్ కుమార్, డిప్యూటి డేమో ఎన్. సత్య కుమార్, వైద్య సిబ్బంది సీహెచ్.శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఘనంగా జరుపనున్న వైస్సార్సీపీ ఆవిర్భావ దినోత్సవం

**- భారీగా పాల్గొనాలని కార్యకర్తలకు పిలుపు**



**రావులపాలెం, మేజర్‌న్యూస్ :** మార్చ్ 12వ తేదీ బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువత పోరు కార్యక్రమం మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాట్టు మంగళవారం మాజీ శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి ఒక ప్రకటన విడుదల చేసారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఉదయం 9 గంటలకి రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరణ చేసుకుని అనంతరం అక్కడి నుండి ర్యాలీగా బయలుదేరి కొత్తపేట ఏరియా ప్రభుత్వ హాస్పిటల్ నందు పార్టీ ఆవిర్భావలి లిదినోత్సవం సందర్భంగా గర్భిణీ స్త్రీలకు, వృద్ధులకు, పేషెంట్లకు వస్త్రాలు, దుప్పట్లు మరియు పండ్లు పంపిణీ చేసి అనంతరం అక్కడినుండి ర్యాలీగా బయలుదేరి అమలాపురం కలెక్టర్ కార్యాలయం వద్దకి వెళ్లి యువత పోరు కార్యక్రమం వినతిపత్రం అందజేస్తారని అయన పేర్కొన్నారు.

ఈకార్యక్రమంనకు నియోజ కవర్గం నలుమూలల నుండి నాయకులు, కార్యకర్తలు, చిర్ల అభిమా నులు అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

## జనసేన ఆవిర్భావ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

**- ఇతర రాష్ట్రాల నుండి సభకు వచ్చేవారికి తగిన వసతులు కల్పించాం - ఏపీ టిడ్కో చైర్మన్, జనసేన జాతీయ మీడియా ఇన్చార్జ్ వేములపాటి అజయ్ కుమార్**



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** ఈనెల 14వ తేదీన చిత్రాడలో జరగనున్న జనసేన ఆవిర్భావ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఏపీ టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ జాతీయ మీడియా ఇన్చార్జ్ మరియు జనసేన సీనియర్ నాయకులు వేములపాటి అజయ్ తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 12వ ఆవిర్భావ దినోత్సవ సభ పిఠాపురం నియోజకవర్గంలో జరుపుకోవడం ఒక చారిత్రాత్మక ఘట్టమని, పార్టీ స్థాపించిన నాటి నుండి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నామన్నారు. ఎన్నికల్లో 100% స్ట్రైక్ రేట్ సాధించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో కూటమి గెలుపు కేంద్రంలో ఎన్ డి ఎ అధికారంలోకి రావడంలో ఒక ప్రధాన భూమిక పోషించిందని, ఎన్నికల్లో తమను ఈ రాష్ట్ర ప్రజలు స్వాగతించారని, పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో పార్టీ ఆవిర్భావ సభ జరగనుండడంతో దేశవ్యాప్తంగా ఉన్న జనసేన నాయకులు కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆవిర్భావ సభకు దేశ నలుమూల నుంచి రానున్న జనసైనికుల కోసం అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఎన్నడూ కనీ వినీ ఎరుగని రీతిలో పండగ వాతావ రణంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభ జరగబోతుందని, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలతో...జనసేన పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జనసేన పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు గతపదిరోజులుగాఏర్పాట్లనుదగ్గరుండి పర్యవేక్షిస్తున్నా మని, అధినేత ఆదేశాలతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు. **ఈ పాత్రికేయ సమావేశంలో...**టీఎస్ ఎన్‌రాజు చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పిఎస్ఎన్ రాజు, జనసేన నాయకులు పిల్లా శ్రీధర్, ఊటా నాని బాబు, పిల్లా శివశంకర్ మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోడసకుర్రులో ఉచిత కంటి పరీక్షలు



**అల్లవరం, మేజర్‌న్యూస్ :** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన రాజమండ్రి నేత్రా కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. గ్రామ ప్రజలు ఈ వైద్య శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వర రావు, మండల టిడిపి యూత్ అధ్యక్షులు ముత్యాల బాబి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ల శ్రీనివాసరావు, పొటుపోతు దుర్గారావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి

**- మంత్రి నాదెండ్ల మనోహర్‌కు గౌరీ నాయుడు వినతి పత్రం**



**కాకినాడ/పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం యువ సాహితీవేత్త, రచయిత, రాచకొండ నరసింహాశర్మ సాహితీ సంస్థ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ అతిథి అధ్యాపక సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ కిలారిగౌరీనాయుడుకాకినాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను బోధిస్తూ విద్యారంగ అభివృద్ధికి విశేష సేవలను అందిస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలపై డాక్టర్ గౌరీ నాయుడు మంత్రితో చర్చించారు. ఒక కళాశాలలో పర్మినెంట్ అధ్యాపకుల బదిలీలు జరిగినప్పుడు అతిథి అధ్యాపకులను పోస్టు ఖాళీగా ఉన్న డిగ్రీ కళాశాలకు పంపించేలాగ విద్యాశాఖ జీవో జారీ చేసేలాగ కూటమి ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నెలవారి ఇచ్చే జీతం గంటల చొప్పున కాకుండా సంవత్సరంలో 12 నెలలు కన్సాలిడేటెడ్ జీతం ప్రభుత్వం ఇచ్చేలాగ ప్రభుత్వం తరపున సహకారాన్ని అందించాలని విన్నవించారు. గత సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిగ్రీ అతిథి అధ్యాపకుల సంఘం నాయకులు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, పిఠాపురం జనసేన ఇన్చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ సమక్షంలో కలిసినప్పుడు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

విద్యార్థుల బంగారు భవిష్య త్తుకు బాటలు వేస్తు న్న అతిథి అధ్యా పకుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారని గౌరీ నాయుడు తెలిపారు.జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ తరపున సహకారాన్ని అందిస్తానని మంత్రి మనోహర్ హామీ ఇవ్వటం పట్ల గౌరీ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, గజపతినగరం మాజీ ఎమ్మెల్యే పడాల అరుణ, రాష్ట్ర తూర్పు కాపు కార్పోరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్విని, కాకినాడ జనసేన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, శాసనమండలి విప్ హరిప్రసాద్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఆంధ్రప్రదేశ్ అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై 'వైకాపా' నాటకం




రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఈనెల 12వ తేదీన వైసీపీ చేపట్టిన 'యువత పోరు' కార్యక్రమం పోస్టరు విడుదల చేయడం హాస్యాస్పదంగా ఉందని టి.ఎన్.ఎస్.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాజ్ కుమార్ రెడ్డి పల్లాల విమర్శించారు. జగన్ రెడ్డి దొంగల ముఠా అంతా కలిసి ఫీజు రియంబర్స్ మెంట్, వసతి దీవెన సకాలంలో చెల్లించాలని నిరసన చేయడం వైఎస్సార్ సీపీ నేతలు ప్రజలను, విద్యార్థులను మోసం చేస్తూ వింత నాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. పేద విద్యార్థులకు చదువులు, ఉద్యోగాలు రాజశేఖర్ రెడ్డి పెట్టిన బిక్ష అని జోగి వాగుతున్న మాటలు వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రజలు బిచ్చగాళ్ళుగా వ్యవహరించినట్టు మాట్లాడినట్టు మీ మాటల్లో అర్ధం ఉందని, వైసీపీ నేతలు సైకో జగన్ రెడ్డి మాటలను అదుపులో పెట్టుకోవాలని టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. జగన్ రెడ్డి అయిదు సంవత్సరాల పాలనలో గుర్తుకు రాని ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన జగన్ రెడ్డికి ప్రతిపక్షంలో ఉండగా గుర్తుకు రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో విద్యార్థుల తరపున పూర్తి ఫీజులు నేరుగా కళాశాల యజమానులకు ప్రభుత్వం అందజేసిందని జగన్ రెడ్డి ప్రచారం చేసుకుంటూ విద్యా దీవెన అంటూ విద్యార్థులను తల్లిదండ్రులకు మోసం చేసింది వైఎస్ఆర్సిపి ప్రభుత్వం సైకో జగన్ రెడ్డి అని ప్రజలకు తెలుసు అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత సైకో జగన్ రెడ్డికి లేదని తీవ్రంగా ఖండించారు. 2014 – 2019 అప్పటి టిడిపి పాలనలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇస్తే జగన్ రెడ్డి పాలనలో కాలయాపన చేస్తూ ఏడు లక్షల పేద విద్యార్థులకు మోసగించి సిగ్గు లేకుండా వైసిపి నేతలు మాట్లాడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిల వలన డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ట్రిబుల్ ఐటీ ఇతర కోర్సులు పూర్తిచేసిన ఉన్నత విద్య చదివే అవకాశం లేకుండా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోగా మరికొంతమంది విద్యార్థులు వైసీపీ ప్రభుత్వంలో సతమతమయ్యారన్నారు. ఐదు సంవత్సరాల కాలంలో ఏదాదికి నాలుగు విడతలు ఎగ్గొట్టి కేవలం ఫీజులకే 4,271 కోట్ల బకాయిలు పెట్టిన సైకో జగన్మోహన్ రెడ్డి ఇవ్వని ఫీజులకు పెద్ద పెద్ద ప్రకటనలు ఇచ్చుకొని దగా చేసింది అప్పటి వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం విశ్వవిద్యాలయాలతో ప్రపంచ స్థాయిలో పోటీ పడుతూ ఉంటే అవహేళన గా మాట్లాడుతున్న వైసీపీ నేతలకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. 2024 జనవరిలో విడుదల చేసి ఇయ్యాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను జగన్ రెడ్డి ప్రభుత్వం ఇవ్వకుండా ఎగ్గొడితే ఇప్పటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆ బకాయిలను విడుదల చేస్తూ విద్యార్థులకు కళాశాలలకు సిబ్బందికి ఇబ్బంది లేకుండా పాలన చేస్తుంటే ఓర్చుకోలేని వైసీపీ నేతలు సైకో జగన్మోహన్ రెడ్డి ఏ అర్హత ఉందని విమర్శిస్తున్నారో చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా బయటకు తీస్తున్నారని, ప్రతిదానికి జవాబుదారీగా పనిచేస్తున్నారనియ, దమ్ముంటే శాసనసభకు వచ్చి జగన్మోహన్ రెడ్డి ప్రశ్నించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా దుయ్యబట్టారు. 2024లో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు మార్పు కోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వాన్ని నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో భవిష్యత్తు తరాల కోసం ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అత్యధిక మెజారిటీతో ప్రజా తీర్పు ఇచ్చి గెలిపించారని పేర్కొన్నారు. ఇంకా ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్యపెడుతున్న వైసీపీ నేతలకు, జగన్మోహన్ రెడ్డికి తగిన గుణపాఠం ప్రజలే నిర్ణయిస్తారని టీ.ఎన్.ఎస్.ఎఫ్. రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ రాజకుమార్ రెడ్డి పల్లాల అన్నారు. వైసీపీ తలపెట్టిన యువత పోరు కార్యక్రమాలు ప్రజలను, విద్యార్థులను మోసగిస్తున్న దగా పోరు కార్యక్రమంగా విమర్శించారు.

'సిఎం చంద్రబాబు' చేతుల మీదుగా బచ్చు ఫౌండేషన్ అధినేతకు

## 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఎక్సలెన్సీ అవార్డు'



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో గల బచ్చుఫౌండేషన్ అధినేత (ఛైర్మన్ మరియు మేనేజింగ్ ట్రస్టీ) బచ్చు అవినాష్ దేవీచంద్రకు బచ్చు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలతో పాటు, పిఠాపురం నుండి తిరుమల తిరుపతికి అఖండ దీపం పాదయాత్ర నిమిత్తం ఫౌండేషన్ ఛైర్మన్ డా.బచ్చు అవినాష్ దేవీచంద్రకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ ఎక్సలెన్సీ అవార్డు దుబాయ్‌లో కేంద్రమంత్రి రామ్‌దాస్ అతవాలే చేతుల మీదుగా తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అవినాష్‌ను విద్య, సామాజిక ప్రభావ నాయకత్వం, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పొందినందుకు ప్రత్యేకంగా అభినందించారు. దీనిలో భాగంగా పెద్దాపురంలో పలువురు బచ్చు అవినాష్ దేవీచంద్రను మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించినవారిలో ఉన్నారు.

# ఎక్సైజ్ దాడులలో 600 లీ.బెల్లపు ఊట ధ్వంసం

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు ఆదేశాల మేరకు ఆధ్వర్యంలో పెద్దాపురం సర్కిల్ పరిధిలోని పెద్దాపురం మండలంలోని మర్లావ గ్రామంలో కాలువ గట్టుపై సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 600 లీ. బెల్లపు ఊట ధ్వంసం చేసి, కేసు నమోదు చేయడం జరిగిందని, ఎక్సైజ్ సిఐ కె.వి.వి.డి.అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై ప్రసాదరావు, మరియు ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలకు అదనపు ఆర్ధిక సాయం

- ఎస్సి, ఎస్టి, బిసి లబ్దిదారులకు వర్తింపు
- హౌసింగ్ ఇఇ కె.వి.ఆర్.గుప్తా



పెద్దాపురం, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి గృహాల లబ్దిదారులకు అదనపు ఆర్ధిక సహాయం అందజేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, పెద్దాపురం హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.ఆర్.గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఆర్ధిక సహాయంపై జిఓ జారీ చేయడం జరిగిందని, ఎస్సి, బిసి లబ్దిదారులకు రూ.50వేలు, ఎస్టి లబ్దిదారులకు రూ.75వేలు, ఎస్టిలలో అట్టడుగున జీవిస్తున్న (పివిటిజి) వార్కి రూ.లక్ష అదనపు ఆర్ధిక సహాయం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వం ఇప్పటికే అందిస్తున్న రూ.1.8 లక్షల యూనిట్ వ్యయానికి అదనంగా ఈ అదనపు ఆర్ధిక సహాయం గృహ నిర్మాణ లబ్దిదారులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కాకినాడ జిల్లా కలెక్టర్ మరియు హౌసింగ్ పిడిల సూచనల మేరకు పెద్దాపురం డివిజన్ పరిధిలో 11 మండలాల పరిధిలో ఇప్పటివరకు 3,359 మంది గృహ నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని, వీటిలో ఎస్సీలు 1127, ఎస్టిలు 72, బిసిలు 2160, వీరందరికి ఈ అదనపు ఆర్ధిక సహాయం వర్తిస్తుందని, కావున గృహనిర్మాణ లబ్దిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు మే31కి పూర్తి చేయాలని, ఆయన సూచించారు.అలాగే డివిజన్ పరిధిలోని డిఇలకు, ఏఇలకు గృహ లబ్దిదారులతో నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా సూచించినట్లు, ఇఇ తెలిపారు. ఈ సమావేశంలో డిఇ సువర్ణరాజు, రవిశంకర్, తదితరులు ఉన్నారు.

## నవోదయలో మహిళా దినోత్సవ వారోత్సవాలు

- ఎస్సై మౌనికకు ఘన సన్మానం



పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలోని పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో మహిళా దినోత్సవ వారోత్సవాలు ప్రిన్సిపాల్ కాటా రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగాయి. మంగళవారం పెద్దాపురం ఎస్సై వి.మౌనికను ఈ వారోత్సవాలకు ఆహ్వానించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మౌనిక విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, ట్రాఫిక్ సేఫ్టీ, మహిళా రక్షణ, మహిళలకు చెందాల్సిన హక్కులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బి.శ్రావణి, రాజ్యలక్ష్మీ, బ్రాహ్మణత, శ్రీనివాసరావుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు నూతన సాంకేతిక విధానాలు పెంపొందించుకోవాలి

- డాక్టర్ మాగంటి శేషుమాధవ్




రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : ఏజెన్సీలో గిరిజన రైతులు నూతన సాంకేతిక విధానాలు పెంపొందించుకోవాలని సి టి ఆర్ ఐ వారి జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేష్ మాధవ్ అన్నారు.

మంగళవారం మండలంలోని జడ్డంగి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొంగర మురళీకృష్ణ అధ్యక్షతన జీడి మామిడి తోటలు, మామిడి తోటలు పెంపకం సస్య రక్షణ పై గిరిజన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గత కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ ప్రస్తుతం మిరప, పసుపు, అశ్వగంధ, ఆముదం వంటి వంటలు పొగాకు పంటలతో పాటు పరిశోధనలు మొదలు పెట్టినట్లు డైరెక్టర్ శేషు మాధవ్ తెలిపారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి ఇటీవలే ఈ సంస్థను జాతీయ వాణిజ్య పరిశోధన సంస్థగా రూపాంతరం చేశారన్నారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో జీడి మామిడి పంట అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని కాగా ఈ పంటకు ఎరువులు తగినంతగా అందించలేకపోతున్నారని దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయని మాధవ్ స్పష్టం చేశారు. జీడి మామిడి తోటలో ఎండు కొమ్ములను కత్తిరించి, కనీసం రెండుసార్లు ఇమిడా క్లో ప్రైడ్ వంటి పురుగు మందులను రైతులు రెండు సార్లు స్ప్రే చేయాలన్నారు.

టీ దోమను, కాండం తొలుచు పురుగుల నువరికట్టవచ్చు అన్నారు. గిరిజన ఉప ప్రణాళిక ఛైర్మన్ డాక్టర్ కె సుమన్ కళ్యాణి మాట్లాడుతూ జీడి మామిడి ప్రతి ఎకరానికి 70 నుండి80 మొక్కలు రైతులు పెంచడం జరిగిందని ఒక్కొక్కు మొక్కకు 750 గ్రాములునుండి కేజీ వరకు పిండి వేయాల్సి ఉంటుంది అన్నారు. అలానే అంతర పంటలు పండించుకోవచ్చు అన్నారు. ఎండు కొమ్ములు కత్తిరించుకొని ఎరువులు సక్రమంగా వేసుకోవాలని ఆమెతెలిపారు. .అలానే సర్పంచ్ మురళీకృష్ణ, జెడ్ పి టి సి జ్యోతి, గణజాల తాతారావు తదితరులు రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం 50 మంది రైతులు కు ఎరువులు అందజేశారు.

# ఆదిత్యలో ఘనంగా జెనిత్ - 2కె25 వేడుకలు






కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాలలో మేనేజ్‌మెంట్ విభాగంవారు 'జెనిత్–2కె25' ను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. కరుణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్‌నేషనల్ అధిపతి శ్రీకర్ కంద పాల్గొన్నారని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ విభాగం నుంచి అధిక సంఖ్యలో విద్యార్థినులు ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగ అవకాశాలను దక్కించుకుంటున్నారని, దీనికి ముఖ్య కారణం విద్యార్థినులు టెక్నికల్ కోర్సులలో కూడా విజ్ఞానాన్ని కలిగి వుండటం అని ఆయన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ఇటువంటి పర్సనాలిటి డెవలప్‌మెంట్ ప్రోగ్రాం వలన అకడమిక్ కోర్సులతో పాటు, కమ్యూనికేషన్ స్కిల్స్ డెవలప్ చేసుకోవటం, బిజినెస్ నిర్వహణ మెలకువలు అలవరుచుకోవటం జరుగుతుందని అన్నారు. కళాశాలకు చెందిన మేనేజ్‌మెంట్ విద్యార్థినులు ప్రతి పోటీలలో విజయం సాధించటం అలవాటుగా మారిందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన బి.ఎన్.ఐ అధిపతి శ్రీకర్ కంద జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇదే వేదికగా విద్యార్థినులకు బిజినెస్ వ్యవస్థాపక మెలకువలు, ఎలా ఏంటర్‌ప్రెన్యుమర్స్‌గా రాణించాలి, మరియు వారు దానికోసం నేర్చుకోవలసిన కోర్సులు క్లుప్తంగా వివరించారు. అలాగే ప్రస్తుతం ఏంటర్‌ప్రెన్యుయర్స్‌గా రాణిస్తున్న వారికోసం వివరించి, విద్యార్థినులలో ప్రోత్సాహాన్ని కలిగించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి జి. అబ్రహం, బి.ఎన్.ఐ మెంబర్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థినులు చురుగ్గా పాల్గొన్నారు.

# జనసేన బహిరంగ సభ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మండలం చిత్రాడ గ్రామం ఎస్బి వెంచర్స్ నందు ఈనెల 14న జరగబోయే జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరు ఐజిపి జీవిజి అశోక్ కుమార్ సభా ప్రాంగణంలో బందోబస్తు ఏర్పాట్లును పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ సభకు పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలకు శాంతి భద్రతలు మరియు ట్రాఫిక్ పరంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేటట్లు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.సభా ప్రాంగణం, వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలు పరిశీలించిన అనంతరం కాకినాడ ఎస్డీపివో, స్థానిక పోలీస్ అధికారులకు కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు.అనంతరం కాకినాడ జిల్లాలోని పోలీస్ అధికారులతో సమావేశమై బందోబస్తుపై చర్చించారు.ఈ బహిరంగ సభకు వచ్చే కార్యకర్తలకు మరియు స్థానిక ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్కు మళ్లించి,ఆర్టీసీ బస్సులు ప్రయాణించే మార్గాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయమని సూచించారు.ఏ విధమైన అత్యవసరమైన పరిస్థితిని ఎదుర్కొనేందుకు గాను ఫైర్ డిపార్టుమెంట్, మెడికల్ డిపార్ట్మెంట్ లతో సంప్రదించి ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులు ఏర్పాటు చేయమని సూచించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎస్పీ జి.బింధు మాధవ్, అదనపు ఎస్పీ పరిపాలన ఏంజెవి భాస్కర్, అదనపు ఎస్పీ ఏఆర్ శ్రీనివాస్,ఎస్డీపివో కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్డీపివో, శ్రీహరి రాజు, ఏఆర్. డిఎస్పీ శ్రీహరి, పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఇతర అధికారులు ఉన్నారు.

# స్కూల్ బస్ బోల్తా 9 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

**– క్షతగాత్రులను పరామర్శించిన జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలో జగ్గంపేట స్వామి వివేకానంద స్కూల్ కు చెందిన బస్సు బోల్తా, బస్సు బోల్తా పడిన సమయంలో 13 మంది విద్యార్థులు బస్సులో ఉండగా 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. హుటా హుటిన జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడంతో అందులో ఇద్దరు విద్యార్థులు కి తీవ్ర గాయలు కావడంతో రాజమండ్రి సాయి హాస్పిటల్ కు తరలించారు.

విషయం తెలుసుకున్న జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జి తుమ్మలపల్లి రమేష్ హుటా హుటిన జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి ఆసుపత్రి వైద్యులను మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. బస్సు బోల్తా ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారుఈ కార్యక్రమం లో కాండ్రేగుల జనసేన నాయకులు గంధం శ్రీనివాస్, రాంచంద్రపురం గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్ గారు,మాధపు వీరబాబు, రాజనాల శ్రీను, మొగిలి గంగాధర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి ఇన్‌టెర్న్ షిప్ ప్రోగ్రామ్

**– దరఖాస్తుకు నేడే చివరి తేది (మార్చి 12)**
**– జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి విడిజీ మురళి**
**– వైటిసి ఏ డీ మూర్తి**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా ఇన్ టెర్న్ షిప్ కు దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులు ఇంటర్న్ షిప్ ఎక్కడ చేయాలి అన్నది ఎంపిక చేసుకోవడానికి పి.ఎమ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకై నిర్దేశింపబడిన లింక్ తెరచి ఉందని ఆసక్తి కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి విడిజీ మురళి, సహాయ సంచాలకులు ఏఎస్ఆర్ మూర్తి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాపింట్స్ అందు చూపబడిన కంపెనీల జాబితా నుండి ఎంపికను నమోదు చేసుకో డానికి నేడే ఆఖరి తీదీ కావున వెంటనే పిఎమ్ఇన్ టెర్న్ షిప్ పొందగోరు విద్యార్థిని విద్యార్థులు వారి పేర్లు నమోదు చేసుకోవలసినదిగా తెలియ జేశారు. ఆసక్తీ ఉన్న అభ్యర్థులు పోర్టల్‌లో పూర్తి సమాచారం తెలుగులో కూడ పూరించి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

# మహిళాల ఆర్థిక పరిపుష్టి కోసం కూటం ప్రభుత్వం పని చేస్తోంది



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని నగర పంచాయితీ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి తెలిపారు.ఏలేశ్వరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళా సంఘాలు పలువురు మహిళలతో కలిసి సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం మహిళలకు అన్ని విధాల అన్యాయం చేసిందని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే 2025 బడ్జెట్ సమావేశాల్లో మహిళలకు 4332 కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.మహిళలకు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమని ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఇప్పటికే 10 కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం చేపట్టిందని,దానిలో భాగంగా అరకు టీ వంటి కార్యక్రమాల ద్వారా మహిళలను వ్యాపార రంగాలలో భాగ్య స్వామ్యం చేయనుందని వచ్చే ఉగాదికి పి 4 అని కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేసే విధంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.ఒక మహిళగా ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ నియోజకవర్గంలో మహిళలు,డ్వాక్రా సంఘాల పట్ల ఆమె ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని ఈ సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్లు వాగు రాజేష్,జొన్నాడ వీరబాబు కౌన్సిలర్లు ఎండగుడి నాగబాబు, కోణాల వెంకటరమణ, ఆనంతారపు రాజు,పెండ్ర శ్రీను,సామంతుల గోపి,కోరాడ కృష్ణ,బుగతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఈ-శ్రమ్ కార్డ్స్ అవేర్‌నెస్ డ్రైవ్




**అల్లవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మరియు జిల్లా మత్స్యశాఖ అధికారి వారి ఆదేశాలు మేరకు సార్డ్స్ (సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ) ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అల్లవరం మండలం, బెండమూరు లంక, రెబ్బనపల్లిలో మంగళవారం ఈ-శ్రమ్ కార్డ్స్ (లేబర్ ఇన్స్యూరెన్స్) అవేర్నెస్ డ్రైవ్‌ను నిర్వహించడం జరిగింది. దాదాపుగా 200 మంది మత్స్యకార కుటుంబాలకు ఈ-శ్రమ్ కార్డ్స్ జారీచేయడం జరిగింది. లబ్ధిదారులు అందరికీ ఈ-శ్రమ్ సేవలు అందేలా చూడాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ టీ.నాగలక్ష్మి తెలియచేశారు.

అదేవిధంగా జిల్లా మత్స్యశాఖ అధికారి సిరినివాసరావు జిల్లాలో ఫిషెర్మన్ కమ్యూనిటీ అందరికీ ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈస్కీంను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కొనియాడారు. ముఖ్యంగా ఎస్ఎఆర్‌డిఎస్ (సార్డ్స్) ష్రిమ్ప్ సినర్జీ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ పి.రము అధ్యక్షతన ఈ-శ్రమ్ డ్రైవ్ ప్రోగ్రాంను నిర్వహించడంజరిగింది.ఈ ప్రోగ్రాంను జిల్లాలో హాచెరీస్, రొయ్యల పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు, మత్స్యకార కుటుంబాలకు ఎక్కువగా లబ్ధిపొందే అవకాశంఉందని, వారందరికీ పరిశ్రమల్లో అవేర్నెస్ ప్రోగ్రెమ్స్, మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేస్తామని చెప్పడం జరిగింది. ప్రస్తుతం ఫిషర్‌మెన్ కమ్యూనిటీ, అలాగే రొయ్యల పరిశ్రమలలో పనిచేసే కార్మికులు ప్రత్యేక శ్రద్ధ వహించి, వారికి వెల్ఫేర్ మరియు వెల్ బీయింగ్ సేవలు అందిస్తామని వ్యక్తం చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎఆర్‌డిఎస్ సంస్థ, ష్రిమ్ప్ సినర్జీ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ పి.రాము, ఫిషర్‌మెన్ కమ్యూనిటీ లీడర్ సాయిబాబు, ప్రసాద్, సాగర మిత్ర బింది, అల్లవరం మండల అధ్యక్షులు కట్టా నారాయణమూర్తి, అల్లవరం మండల ప్రధానకార్యదర్శి అంగాని ధనుంజయ, బిజెపి సీనియర్ నాయకులు రేఖాడి సత్యనారాయణ వర్మ,బిజెపి అల్లవరం మండల కార్యదర్శి సేరు నూకరాజు మొదలగువారు పాల్గొన్నారు.

# బ్యాంకు రుణాల పంపిణీ మరింత ముమ్మరం చేయాలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి, సంక్షేమ పథకాల లబ్దిదారులకు బ్యాంకు రుణాల పంపిణీ మరింత ముమ్మరం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా బ్యాంకులు, జిల్లా అధికారులను కోరారు. మంగళవారం మద్యాహ్నం కలక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో బ్యాంకులు, జిల్లా అధికారులతో డిస్ట్రిక్ట్ కన్సల్టేటీవ్ కమిటీ, డిస్ట్రిక్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశాలు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధ్యక్షతన జరిగాయి. సమావేశంలో 2024–25 సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక అమలులో భాగంగా వివిధ అంశాలలో సాధించిన ప్రగతి, లక్ష్య సాధన పూర్తి చేసేందుకు చివరి త్రైమాసంలో చేపట్టవలసిన కార్యచరణలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గత డిశంబరు 31వ తేదీతో ముగిసిన త్రైమాసాంతం నాటికి వివిధ రంగాలకు అందించిన రుణాల ప్రగతిని సమీక్షిస్తూ వ్యవసాయ రంగానికి రూ.11,460 కోట్ల రుణాల కల్పన లక్ష్యానికి గాను రూ.10,780 కోట్ల మేరకు రుణాలు కల్పించి 94.06 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. సూక్ష్మ, చిన్న, మద్యతరహా పరిశ్రమల రంగానికి రూ.4,183 కోట్లు రుణాలు జారీ లక్ష్యానికి గానూ రూ.4,102 కోట్లు పంపిణీ చేసి 98.03 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. అలాగే ఇతర నాన్ ప్రియారిటీ రంగాలకు రూ.4,184 కోట్లు రుణాల కల్పనకు గాను లక్ష్యాన్ని మించి రూ.5,872 కోట్లు పంపిణీ చేసి 140.34 శాతం సాధించడం ముదావహన్నారు. జిల్లాలో ఈ యేడాది ఇప్పటి వరకూ 15,599 మంది కౌలురైతులకు వక్తిగతంగా రూ.55.48 కోట్లు, 20,495 మంది కౌలు రైతులకు ఆర్ఎంజి, జిఎల్జి గ్రూపుల ద్వారా మరో రూ.79.48 కోట్లు పంట రుణాలు మంజూరు చేసారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్వావలంబన పథకాల ద్వారా వివిధ సంక్షేమ కార్పోరేషన్ల ద్వారా 3,704 మంది లబ్దిదారులకు రూ.4,568 కోట్లు రుణాలు కల్పన లక్ష్యం నిర్ధేశించడం జరిగిందని, ఈ లక్ష్యాన్ని బ్యాంకులు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు. అలాగే ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా 57 జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు 50 శాతం బ్యాంకు రుణాలుగా రూ.228 కోట్లు అందించాలన్నారు. డిఆర్డిఏ ద్వారా ఇప్పటి వరకూ 14,315 డ్వాక్రా గ్రూపులకు రూ.1075 కోట్లు (62.14 శాతం), మెప్మా ద్వారా 4,312 డ్వాక్వా గ్రూపులకు రూ.508 కోట్లు (240 శాతం) బ్యాంకు రుణాల లింకేజి అందించడం జరిగిందన్నారు. పియం విశ్వకర్మ యోజన ద్వారా ఇప్పటివరకూ 3,801 ధరఖాస్తులు ఆమోదం పొందగా, వీరికి ఆయా నైపుణ్యాలలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పియంఈజిపి పథకం ద్వారా రూ.538 కోట్లు బ్యాంకు రుణంతో ఇప్పటు వరకూ 140 యూనిట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా గ్రౌండ్ అయ్యాయన్నారు. పియంఎఫ్ఎంఈ పథకం ద్వారా మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపనకు రూ.10 లక్షల వరకూ ష్యూరిటీ కోరకుండా రుణాలు అందించాలని బ్యాంకర్లను కోరారు.

జిల్లాలో ఫైనాన్సియల్ లిట్రసీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, మండల స్థాయిలో జరిగే జెఎల్బిసి సమావేశాలకు సంబంధిత బ్యాంకుల మేనేజర్లు తప్పనిసరిగా హాజరు కావాలని జాయింట్ కలెక్టర్ కోరారు. సమావేశంలో పాల్గొన్న ఎంఎల్సీ కర్రి పద్మశ్రీ విశ్వకర్మ యోజన ద్వారా పూలదండల వ్యాపారులకు రుణాలు కల్పించాలని బ్యాంకర్లను కోరారు. కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ కాకి సాయి మనోహర్ టిడ్కో రుణాలు, మొండి ఎన్పిఏ రుణాల రికవరిలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది బ్యాంకర్లకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎల్.డి.యం. సిహెచ్.ఎస్.వి, ప్రసాద్, రిజర్వుబ్యాంకు ఎల్డిఓ పూర్ణిమ, నాబార్డు ఎజియం వై.సోమునాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు, వ్యవసాయ, అనుబంధ రంగ శాఖల అధికారులు, పరిశ్రమలు,సంక్షేమ శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా కొవ్వూరు లయన్స్ క్లబ్ కృషి

**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా కొవ్వూరు లయన్స్ క్లబ్ పనిచేస్తుందని జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. కొవ్వూరు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వార్షిక అధికారిక పర్యటన సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరుగురు మహిళలకు గవర్నర్ కుట్టుమిషన్లను పంపిణీ చేశారు.క్లబ్ అధ్యక్షులు మద్దిపాటి వివి సత్యనారాయణ, జిల్లా లయన్స్ నాయకులు చినబాబు చౌదరి, మద్దుకూరి శ్రీహరి, సెక్రటరీ నామాన బుల్లి రాజు, లయన్స్ క్లబ్ సభ్యులు పరిమి హరిచరణ్, గోలి వెంకటరత్నం, సూరపనేని చిన్ని, కంటమని రామకిషోర్, మన్యం బుల్లి బాబు, యనమదుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



# విద్యాదానం అన్నింటికంటే గొప్పది

- పరీక్షల వేళ భయాందోళన వీడాలి
- పది విద్యార్థులకు ఆల్ ఇన్ వన్‌లు అందజేత
- అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ తాళ్లూరి హరిబాబు సాయం అభినందనీయం
- ఎటపాక ఎంఈఓ రాజులు






**ఎటపాక,మేజర్‌న్యూస్ :** విద్యాదానం అన్నింటికంటే గొప్పదని,మారుమూల గ్రామాల్లోని పేద, నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడం హర్షణీయమని ఎంఈఓ రాజులు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అరోరా స్కూల్ ఆఫ్ నర్సింగ్ చైర్మన్ తాళ్లూరి హరిబాబు సహాయంతో అందించిన ఆల్ ఇన్ వన్ గైడ్ లు పంపిణీ కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సరియం రాజులు హాెరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల వేళ విద్యార్థులు భయాందోళన వీడాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఒత్తిడిని అధిగమిస్తూ ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రశ్నలకి సమాధానాలు రాయాలన్నారు. పరీక్ష హాలులో ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే ఇన్విజిలేటర్‌కి చెప్పాలన్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. హరిబాబు అందిస్తున్న సేవలు కొనియాడారు.

విద్యార్థులకు ఎల్లపుడూ తనవంతుగా సహకరిస్తున్నారు అన్నారు. గత ఏడాది పది విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్న సమయంలో స్నాక్స్ అందించార న్నారు. ఈ సంవత్సరం పాలు అందించారని, వాటితో ఇచ్చిన ఆల్ ఇన్ వన్ గైడ్‌లు విద్యార్థులకు ఎంతో దోహదపడతా యన్నారు. అనంతరం విద్యార్థులకు ఆల్‌ఇన్ వన్‌లు అందజేశారు. ఇందులో భాగంగా హెూలీ స్పిరిట్ కార్యదర్శి దారా రవి, గౌరీదేవిపేట ఎస్సీ బోయ్స్ హాస్టల్ వార్డెన్ పవన్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెూలీ స్పిరిట్ కార్యవర్గ సభ్యుడు ములకలపల్లి రమేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న వైసిపి నాయకులు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట 13వ వార్డు ప్రజలు నిన్న కమిసినర్ గారిని సీసీ రోడ్లు వేయమని వెళ్లగా ఆ విషయాన్నీ వక్రీకరించిన వైసీపీ నాయకులు కడుపు మంటతో కూటమి నాయకులే అడ్డు కుంటున్నారని అసత్య ప్రసారాలతో వీర్రావిగుతున్నారు జరుతున్న అభివృద్ధి వారికీ కనిపించడం లేదని సామార్లకోట బలుసుల పేట టీడీపీ నాయకులు కాళ్ల రవీంద్ర తెలిపారు. గత ఐదు సంవత్స రాలలో ఒక్క అభివృద్ధి చెయ్యలేదు కాగాఎమ్మెల్యే చిన్నరాజప్ప చేస్తున్న అభివృద్ధి కార్యక్రామాలకు ఈ వైసిపి నాయకులు ఆటంకాలు కలిగిస్తున్నారు ప్రజలు అన్ని గమనిస్తున్నారని రవీంద్ర తెలిపారు. బలుసుల పేట అభివృద్ధి కొరకు టిడిపి కూటమి ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలిపారు. వైసిపి కౌన్సిలర్ హరిబాబు టిడిపి ప్రభుత్వం రోడ్లు వేయడం లేదంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని కమీషనర్ కు వివరించారు.

## గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిడిఓ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :**పెద్దాపురం మండలంలోని వెలుగు ప్రాజెక్ట్ కార్యాలయం నందు ఎపిఎం శ్రీనుబాబు అధ్యక్షతన మంగళవారం పడాల ట్రస్ట్ ఆధ్వర్యంలో యానిమేటర్లకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి డి.శ్రీలలిత పాల్గొని మాట్లాడుతూ, గ్రామాలలో యానిమేటర్లు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ప్రజలకు, విద్యార్థులకు కల్పించాలని తెలిపారు. అనంతరం ఎంబికె, స్త్రీనిధి రికవరీ, లోకోస్ యాప్‌పై, వి.పి.ఆర్.పి.పై ఎపిఎం శ్రీనుబాబు యానిమేటర్లతో సమీక్షించారు. ఈ సమావేశంలో సిసిలు శ్రీనివాస్, బి.దుర్గ, సిహెచ్.జ్ఞానవతి, అకౌంటెంట్ సూర్య, మండలంలోని యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## యువసేన బ్లడ్ బ్యాంక్ ఆకస్మిక తనిఖీ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడలో ఉన్న యువసేన బ్లడ్ బ్యాంక్‌కి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.జె.నరసింహ నాయక్.. జిల్లా లెప్రస్సీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా రిజిస్టర్లు అన్ని పరిశీలించి, ప్రజల నుంచి వసూలు చేస్తున్న చార్జీల వివరాలు ఆరా తీశారు. పేషెంట్ రిక్విజేషన్ ఫామ్ తీసుకుని ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పేషంట్ పేమెంట్ రిసిప్ట్ ఇష్యూ రిజిస్టర్స్ అన్ని సక్రమంగా ఉన్నాయని డీఎం అండ్ హెచ్‌ఓ తెలిపారు. బ్లడ్ బ్యాంకులో మెయింటైన్ చేస్తున్నటువంటి రిజిస్టర్‌లన్నియు పరిశీలించడం జరిగింది, బ్లడ్ స్టాక్ రిజిస్టర్, డోనర్ రికార్డ్, క్యాంప్ రిజిస్టర్స్, క్రాస్ మ్యాచింగ్, డిస్కార్ట్ రిజిస్టర్, బ్లడ్ ఇష్యూ రిజిస్టర్, పేషెంట్ రిక్విజేషన్ ఫామ్, పేషెంట్ రిసీవ్డ్, మరియు ఫిజికల్ స్టాక్ క్రాస్, గవర్నమెంటు బ్లడ్ బ్యాంక్ ఇచ్చిన 30% బ్లడ్ మంత్లీ డోనర్స్ అండ్ మంత్లీ ఇష్యూ రిజిస్టర్ మరియు బ్లడ్ కలెక్షన్ రూమ్ క్రాస్ మ్యాచింగ్ రూమ్ కాంపోనెంట్ ప్రిపరేషన్ రూమ్ వైరల్ స్క్రీనింగ్ రూమ్ పరిశీలించడం జరిగిందని ఆయన తెలిపారు.